Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

శనివారం 27-06-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :10 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

### హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌లో

# రాష్ట్రం వెనకడుగు




2 లో

# ప్రైవేట్ స్కూళ్లకు షాక్

### ప్రభుత్వ పాఠశాలల్లో భారీగా విద్యార్థుల చేరిక


- ప్రభుత్వ బడులకు ఆదరణ
- లక్ష మందికి పైగా చేరిక
- ప్రైవేట్ స్కూళ్లకు ఎదురుదెబ్బ
- విద్యలో ఏఐకి శ్రీకారం
- ఫీజుల నియంత్రణపై దృష్టి



2 లో

# హైదరాబాద్ చెరువులకు హైడ్రా టచ్

### రూ.107 కోట్ల భారీ ప్రాజెక్ట్.!




2 లో

# ఫ్రీగా చేయలేం

## 'సర్' విషయంలో బీఎల్‌ఏల కండీషన్!

- 'సర్'కు రేటు ఫిక్స్?
- ఓట్ల కాపలాకు భారీ ఖర్చు
- ఏజెంట్ల కోసం నేతల తంటాలు
- బూత్‌ల వద్ద రాజకీయ పోటీ
- గ్రేటర్‌లో కాంగ్రెస్ గండం
- 'సర్'తో పార్టీలకు కొత్త పరీక్ష



**న్యూస్ డెస్క్, 26 జూన్ (ఇది కద నిజం):** రాష్ట్రంలో సమగ్ర ఓటరు జాబితా రూపకల్పన కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతోన్న ఎస్ఐఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రోగ్రాం ప్రధాన రాజకీయ పార్టీలకు సవాలుగా మారింది. పార్టీ మద్దతుదారుల ఓట్లకు ఇబ్బందులు రాకుండా చూసుకునే బాధ్యతలను బూత్ లెవల్ ఏజెంట్లకు అప్పగించింది. అందుకోసం పార్టీలో సీనియర్ కార్యకర్తలను ఎంపిక చేసింది. ఎంపిక చేసిన ఏజెంట్లు తమ పనులు వదిలేసి 'సర్' కార్యక్రమంలో పాల్గొనాలంటే ఎంతో కొంత డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది.

**పరేషాన్‌లో లీడర్లు..**

'సర్' కార్యక్రమం నేపథ్యంలో తమ పార్టీ మద్దతుదారుల ఓట్లకు ఇబ్బందులు రాకుండా చూసుకునేందుకు అన్ని పార్టీలు పోలింగ్ బూత్ ఏజెంట్లను నియమించాయి. వీరంతా తమకు అప్పగించిన బూత్‌లోని అర్హులైన ఓట్లు డిలీట్ కాకుండా చూసుకోవాలి. ఒకవేళ అర్హుల ఓట్లను తొలగించే పరిస్థితులు ఉంటే సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్లకు సరైన ఆధారాలు చూపించి.. జాబితాను యాథావిధిగా కొనసాగించేందుకు చొరవ చూపాలి. అందుకోసం ప్రతి బూత్‌లో ఎన్ని ఓట్లు ఉన్నాయి? పార్టీ మద్దతుదారులు ఎందరు ఉన్నారు? అనే అంశాలపై పూర్తి అవగాహన ఉన్న సీనియర్ కార్యకర్తలను ఏజెంట్లుగా నియమిస్తున్నారు. సుమారు వంద రోజుల పాటు జరిగే 'సర్' కార్యక్రమంలో ఏజెంట్ల పాత్ర కీలకంగా మారింది. దీంతో సదరు ఏజెంట్లు ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్‌చార్జిల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఎంతోకొంత డబ్బులు ఇవ్వకపోతే పని చేయలేమంటూ మొహం మీదనే చెప్పడంతో ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పరేషాన్‌లో ఉన్నట్టు టాక్ వినిపిస్తోంది.

**బూత్‌కు రూ.10 వేల ఖర్చు?**


ఒక్కో బూత్ ఏజెంట్‌కు కనిష్టంగా రూ.10వేలు ఇచ్చేందుకు కొన్ని పార్టీలు రెడీ అయినట్లు తెలిసింది. రూలింగ్ పార్టీకి చెందిన ఏజెంట్లు కాస్త ఎక్కువగానే డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం ఉంది. కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే, ఎంపీలు కలిసి ఖర్చులు భరిస్తుండగా, కొన్ని జిల్లాల్లో జిల్లాకు చెందిన మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు ఖర్చు చేస్తున్నట్టు సమాచారం. నియోజకవర్గానికి 250 నుంచి 300 వరకు బూత్‌లు ఉంటాయి. కొన్ని చోట్ల బూత్‌ల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది. అయితే, బూత్ ఏజెంట్లు అడిగే డబ్బులకు కాస్త అటు ఇటుగా ఇచ్చి పని చేయించుకునేందుకు అన్ని పార్టీలు ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. ఎందుకంటే ఏజెంట్లు లేకపోతే తమ పార్టీకి చెందిన ఓట్లు గల్లంతవుతాయేమోననే భయంతోనే నేతలు ఖర్చుకు వెనకాడం లేదని టాక్ ఉంది.

మిగతాది 2 లో..

# ఢిల్లీ ఎయిమ్స్ కీలక నిర్ణయం


### కఠిన సోషల్ మీడియా రూల్స్ అమల్లోకి

- ఎయిమ్స్ కొత్త మార్గదర్శకాలు
- పేరు, లోగో వినియోగానికి అనుమతి తప్పనిసరి
- రోగుల గోప్యతకు పెద్దపీట




**న్యూస్ డెస్క్, 26 జూన్ (ఇది కద నిజం):** దేశ రాజధాని న్యూ ఢిల్లీలోని అత్యున్నత వైద్య విద్యాసంస్థ ఆలిండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ సంస్థకు చెందిన విద్యార్థులు, ఫ్యాకల్టీ, రెసిడెంట్ డాక్టర్లు, ఉద్యోగుల కోసం కఠినమైన సోషల్ మీడియా మార్గదర్శకాలను శనివారం విడుదల చేసింది. ఎయిమ్స్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడటంతో పాటు, రోగుల గోప్యతకు భంగం కలగకుండా చూడాలనే ఉద్దేశంతో ఈ నిబంధనలను తీసుకువచ్చినట్లుగా సంస్థ యాజమాన్యం స్పష్టం చేసింది.

2 లో



# ఇస్లాంలోకి మారితే రిజర్వేషన్ రాదు

- మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు

2 లో

# బంగ్లాదేశీయులకు ఊరట

### రెండేళ్ల తర్వాత భారత్ కీలక నిర్ణయం



- 28 నుంచి వీసాల జారీ
- బంగ్లాదేశీయులకు ఊరట
- మళ్లీ బలపడుతున్న సంబంధాలు
- ప్రయాణాలకు గ్రీన్ సిగ్నల్

**న్యూస్ డెస్క్, 26 జూన్ (ఇది కద నిజం):** రెండు సంవత్సరాల తర్వాత బంగ్లాదేశ్ వాసులకు ఊరట ఇచ్చింది ఇండియా. బంగ్లాదేశీయులు ఇండియాలో పర్యటించేందుకు వీలుగా వీసా జారీ ప్రక్రియను ఈనెల 28వ తేదీ నుంచి పునరుద్ధరించనున్నట్లు కేంద్ర సర్కార్ ప్రకటించింది. 2024 ఆగస్టులో అప్పటి బంగ్లా ప్రధాని హసీనా దేశం విడిచి ఇండియాకు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇరు దేశాల సంబంధాలు దెబ్బతిన్నాయి. అప్పటి నుంచి వీసాలను కూడా నిలిపివేసింది ఇండియన్ సర్కార్. ఏడాది ఫిబ్రవరిలో తారిక్ ప్రధాని అయ్యాక మళ్లీ సంబంధాలు క్రమంగా బలపడుతున్నాయి.

2 లో

# రాష్ట్రంలో ఐఏఎస్‌ల బదిలీ

### సీఎం ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్





2 లో

- సీఎం సీఎస్‌గా శ్రీధర్
- అజిత్ రెడ్డికి కొత్త బాధ్యతలు
- పలువురికి కీలక పోస్టులు
- వరంగల్‌కు కొత్త కమిషనర్

# ముగిసిన మధ్యంతర బెయిల్ గడువు

## మళ్లీ చర్లపల్లి జైలుకు బండి భగీరథ్

- పరీక్షల కోసమే ఉపశమనం
- అర్ధరాత్రి అదుపులోకి
- కోర్టు విచారణపై ఉత్కంఠ




2 లో

**న్యూస్ డెస్క్, 26 జూన్ (ఇది కద నిజం):** గత కొన్ని రోజులుగా తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన బండి భగీరథ్ పోక్సో కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇటీవలే బెయిల్‌పై విడుదల ఆయన్ను పోలీసులు తిరిగి చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. న్యాయస్థానం మంజూరు చేసిన మధ్యంతర బెయిల్ గడువు ముగియడంతో గురువారం అర్ధరాత్రి వేళ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని జైలుకు పంపించారు. తంలో నమోదైన ఈ తీవ్రమైన నేరారోపణల కేసులో అరెస్టయిన భగీరథ్‌కు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోర్టు గతంలోనే రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి అతడు చర్లపల్లి జైలులోనే రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.

# డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం

### ఇకపై జీరో టాలరెన్స్: సీఎం చంద్రబాబు




2 లో

**న్యూస్ డెస్క్, 26 జూన్ (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత కఠినమైన హెచ్చరికలు జారీ చేశారు. "మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం" సందర్భంగా ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా రాష్ట్ర ప్రజలనుద్దేశించి ఒక కీలక సందేశాన్ని ఇచ్చారు.

### డ్రగ్స్ రహిత తెలంగాణే మన లక్ష్యం

**: సీఎం రేవంత్ రెడ్డి**




2 లో

# ఏపీలో డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం
# ఇకపై జీరో టాలరెన్స్: సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా మనం చేసే ఈ పోరాటం అంతిమంగా మన యువత భవిష్యత్తు, వారి ఆరోగ్యం, వారి కలలను కాపాడే ఒక యుద్ధమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ వేళ్లూనుకుపోయిన ఆ పాత చీకటి రోజులు ఇప్పుడు గతంగా మారిపోయాయని స్పష్టం చేసిన చంద్రబాబు.. గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాపై తమ ప్రభుత్వం కనికరం లేకుండా ఉక్కుపాదం మోపుతుందని, ఈ రవాణాకు బాధ్యులైన వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షిస్తామని తేల్చి చెప్పారు. ఏపీని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబిస్తున్నట్లు ప్రకటించారు.

మరోవైపు, డ్రగ్స్ మహమ్మారి బారిన పడి వ్యసనంతో పోరాడుతున్న బాధితుల పట్ల సీఎం మానవీయ కోణంలో స్పందించారు. వ్యసన విముక్తి కోసం తపించే వారికి ప్రభుత్వం తరపున సాధ్యమైన అన్ని విధాలా పునరావాస సహాయ సహకారాలు అందిస్తామని, వారు సమాజంలో గౌరవప్రదంగా కోలుకుని మళ్లీ సరికొత్త జీవితాన్ని నిర్మించుకునేలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. డ్రగ్స్ మహమ్మారిని అంతమొందించి, ప్రతి కుటుంబానికి సురక్షితమైన భవిష్యత్తును, నూతన ఆశలను అందించడమే తమ కూటమి ప్రభుత్వ ప్రధాన ఆశయమని చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## డ్రగ్స్ రహిత తెలంగాణే మన లక్ష్యం: సీఎం రేవంత్ రెడ్డి




**న్యూస్ డెస్క్, 26 జూన్ (ఇది కద నిజం):** అంతర్జాతీయ యాంటీ-డ్రగ్స్ డే సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు, యువతకు కీలక సందేశాన్ని ఇచ్చారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. యువతలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ద్వారా మాత్రమే మాదక ద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మించగలమని ఆయన స్పష్టం చేశారు.

మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాకుండా, వారి నమ్ముకున్న కుటుంబాలను సైతం పూర్తిగా విచ్ఛిన్నం చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ సంస్కృతి వల్ల సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడటమే కాకుండా.. అది శాంతిభద్రతల సమస్యలకు కూడా దారితీస్తుందని హెచ్చరించారు. డ్రగ్స్ నియంత్రణ, వాటి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు సమాజంలో విస్తృత అవగాహన, అప్రమత్తతతో పాటు ప్రతి ఒక్కరిలో సామాజిక బాధ్యత ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'డ్రగ్ ఫ్రీ తెలంగాణ' లక్ష్య సాధనలో యువత, తల్లిదండ్రులు, పౌర సమాజం భాగస్వాములై ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో సహకరించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# ఢిల్లీ ఎయిమ్స్ కీలక నిర్ణయం
# కఠిన సోషల్ మీడియా రూల్స్ అమల్లోకి

మొదటి పేజీ తరువాయి

పేరు, లోగో వాడకంపై నిషేధం..

తాజా మార్గదర్శకాల ప్రకారం ఎయిమ్స్ పరిధిలోని విద్యార్థులు, సిబ్బంది, గుర్తింపు పొందిన అసోసియేషన్లు ఎవరైనా సరే అనుమతి లేకుండా 'ూ××మీా, చీవష ఐవశ్రీష్ట్రఱ' అనే పేరును కానీ, సంస్థ అధికారిక లోగో, బ్రాండింగ్‌ను కానీ ఉపయోగించకూడదు. ఈ నిబంధన ఈవెంట్ పోస్టర్లు, బ్యానర్లు, సోషల్ మీడియా పేజీలు, యూట్యూబ్ వీడియోలు, బ్లాగులు, అఫీషియల్‌లా కనిపించే సోషల్ మీడియా హ్యాండిల్స్‌కు కూడా వర్తిస్తుందని యాజమాన్యం ఉత్తర్వుల్లో పేర్కొంది. అదేవిధంగా మెడికల్ ప్రాక్టీస్ చేస్తున్న వైద్యులు, విద్యార్థులు రోగుల వ్యక్తిగత సమాచారాన్ని, వారి ఫోటోలు, కేసు వివరాలను సోషల్ మీడియాలో షేర్ చేయడాన్ని పూర్తిగా బ్యాన్ చేశారు. దీనితో పాటు రాగింగ్, బుల్లీయింగ్, హేట్ స్పీచ్, అశ్లీలత, కోర్టు నిందనలకు సంబంధించిన కంటెంట్‌ను పోస్ట్ చేయకూడదనే ఆదేశాలు వెలువడ్డాయి. ఒకవేళ నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే తీవ్ర క్రమశిక్షణా చర్యలతో పాటు చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎయిమ్స్ హెచ్చరించింది.

# ముగిసిన మధ్యంతర బెయిల్ గడువు..
# మళ్లీ చర్లపల్లి జైలుకు బండి భగీరథ్

మొదటి పేజీ తరువాయి

పరీక్షల నిమిత్తం కోర్టు మంజూరు చేసిన బెయిల్..


అయితే తాను ప్రస్తుతం ఇంజినీరింగ్ చదువుతున్నానని, తన విద్యా సంవత్సరం పాడవకుండా పరీక్షలు రాసేందుకు వీలుగా అనుమతి ఇవ్వాలని కోరుతూ బండి భగీరథ్ తరపు న్యాయవాదులు జిల్లా కోర్టులో ప్రత్యేక పిటిషన్ దాఖలు చేశారు. విద్యార్థి భవిష్యత్తును, చదువును దృష్టిలో ఉంచుకున్న న్యాయస్థానం మానవతా దృక్పథంతో స్పందించింది. ఇంజినీరింగ్ పరీక్షలకు హాజరు అయ్యేందుకు వీలుగా ఈ నెల 20వ తేదీన అతడికి షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. కోర్టు ఇచ్చిన ఈ ఊరటతో జైలు నుంచి బయటకు వచ్చిన భగీరథ్ తన పరీక్షలకు హాజరయ్యాడు.

నిబంధనల ప్రకారం ముగిసిన గడువు.. అర్ధరాత్రి మళ్లీ అరెస్ట్

కోర్టు విధించిన కఠినమైన నిబంధనల ప్రకారం గురువారంతో బండి భగీరథ్ మధ్యంతర బెయిల్ కాల పరిమితి ముగిసింది. బెయిల్ గడువు ముగిసిన తక్షణమే అప్రమత్తమైన మేడ్చల్ పోలీసులు గురువారం రాత్రి అతడిని తిరిగి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. నిందితుడిని నేరుగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, నిబంధనల ప్రకారం అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ల ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తీసుకున్న అనంతరం.. అర్ధరాత్రి దాటాకా కట్టుదిట్టమైన భద్రత మధ్య చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించి జైలు అధికారులకు అప్పగించారు

తదుపరి న్యాయ విచారణపై ఉత్కంఠ

అయితే ఓ 17 ఏళ్ల అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మానసికంగా వేధించాడని, ఓరోజు ఫామ్ హౌస్‌కు తీసుకెళ్లి.. మద్యం తాగించాక ఆమెతో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈక్రమంలోనే మే 16వ తేదీన పోలీసులు బండి భగీరథ్‌ను అరెస్ట్ చేశారు. అయితే ఈ పోక్సో కేసులో దర్యాప్తు ఇప్పటికే కీలక దశకు చేరుకుందని, నిందితుడికి పరీక్షల కోసమే తాత్కాలిక ఉపశమనం లభించిందని, కేసు విచారణ చట్టప్రకారం యథావిధిగా కొనసాగుతుందని పోలీసు వర్గాలు స్పష్టం చేశాయి. ఈ హైప్రొఫైల్ కేసులో తదుపరి కోర్టు విచారణ ఏ విధంగా ఉండబోతుందనే అంశంపైనే ఇప్పుడు అందరూ దృష్టి సారించారు.




# ఫ్రీగా చేయలేం
# 'సర్' విషయంలో బీఎల్‌ఏల కండీషన్!


మొదటి పేజీ తరువాయి

గ్రేటర్‌లో కాంగ్రెస్‌కు కష్టాలు!



గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 23 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు పెద్దగా కేడర్ లేదు. దీంతో ఈ ప్రాంతంలోని ఏజెంట్లను నియమించడం పెద్ద సవాలుగా మారిందని చర్చ జరుగుతున్నది. నెల రోజుల కిందట అటు బీజేపీ, ఇటు బీఆర్ఎస్ పార్టీలు 'సర్' కార్యక్రమంలో ఏ విధంగా వ్యవహరించాలో కేడర్‌కు ట్రైనింగ్ ఇచ్చారు. కానీ కాంగ్రెస్ పార్టీకి స్థానికంగా లీడర్లు, కార్యకర్తలు లేకపోవడంతో అలాంటి శిక్షణ కార్యక్రమాలు జరగలేదని టాక్. ఈ విషయాన్ని గ్రహించిన సీఎం రేవంత్ రెడ్డి గ్రేటర్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలను అలర్ట్ చేసి బూత్ లెవల్ ఏజెంట్లను నియమించాలంటూ ఆదేశించినట్లు తెలుస్తోంది.

## హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌లో రాష్ట్రం వెనకడుగు




**న్యూస్ డెస్క్, 26 జూన్ (ఇది కద నిజం):** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సెర్వికల్ క్యాన్సర్) మహమ్మారిని నివారించేందుకు ఉద్దేశించిన ప్రతిష్టాత్మక హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను అధికారులు గాలికొదిలేశారు. సాక్ష్యాత్తు ప్రభుత్వ యూ-విన్ అధికారిక నివేదిక (జూన్ 17, 2026) ప్రకారం రాష్ట్రంలో వ్యాక్సినేషన్ ప్రక్రియ ఎంత నత్తనడకన సాగుతున్నదో బయటపెట్టింది. రాష్ట్ర సగటు కేవలం 26 శాతానికే పరిమితం కావడం చూస్తే.. ఉచిత వ్యాక్సిన్ పై అవగాహన కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం ఏ పాటిదో అర్థమవుతున్నది.

వ్యాక్సినేషన్ లో వెనకే..

రాష్ట్రంలో ప్రతియేటా సుమారు 60 వేల వరకు క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. రాబోయే ఐదేళ్లలో ఈ సంఖ్య మరో 10 శాతం పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రభుత్వం వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఈ ఏడాది ఫిబ్రవరి 28న లాంఛనంగా ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 33 జిల్లాల్లో చేపట్టిన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రక్రియ నాలుగు నెలలు పూర్తవుతున్నా... మందకొడిగా సాగుతున్నట్లు తెలుస్తున్నది.

అధికారిక వివరాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో అర్హులైన బాలికలను గుర్తించేందుకు నిర్వహించిన సర్వేలో మొత్తం 3,47,442 మంది బాలికలను గుర్తించారు. అయితే, వీరి కోసం అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 21,912 వ్యాక్సినేషన్ సెషన్లను (కేంద్రాలను) నిర్వహించినప్పటికీ, ఇప్పటివరకు కేవలం 91,289 మంది బాలికలకు మాత్రమే టీకాలు అందించగలిగారు. దీనివల్ల రాష్ట్ర సగటు వ్యాక్సినేషన్ కేవలం 26 శాతానికే పరిమితమైంది. గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు వందశాతం వ్యాక్సినేషన్ పూర్తి చేశాయి. మిజోరం (89), బీహార్(85), ఆంధ్రప్రదేశ్ (70) వంటి రాష్ట్రాలు మన కంటే ఎంతో ముందున్నాయి.

రాజధానిలో మరీ ఘోరం

అవగాహన, వనరులు పుష్కలంగా ఉండే రాష్ట్ర రాజధాని హైదరాబాద్ జిల్లాలో వ్యాక్సినేషన్ ప్రగతి కేవలం మూడు శాతం మాత్రమే నమోదవడం అత్యంత దిగ్భ్రాంతికరంగా భావిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 42,360 మంది బాలికలను గుర్తించి సర్వే చేసిన అధికారులు.. కనీసం 1,177 మందికి కూడా టీకాలు వేయించలేకపోయారంటే క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. ఐటీ కారిడార్, విద్యావంతులు ఎక్కువగా ఉండే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో సైతం కేవలం 8 శాతం మాత్రమే వ్యాక్సినేషన్ జరగడం గమనార్హం. వ్యాక్సిన్ల లభ్యత ఉండి, నిధులు అందుబాటులో ఉన్నా.. పట్టణ ప్రాంతాల్లోని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను సమన్వయం చేయడంలో రాష్ట్ర, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు పూర్తిగా చేతులెత్తేశారనే చర్చ జరుగుతున్నది.

గ్రామీణ అధికారుల చొరవ..

పెద్దపల్లి జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని 74 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసి రాష్ట్రంలోనే అగ్ర స్థానంలో నిలిచారు. రాజన్న సిరిసిల్ల (68 శాతం), ఖమ్మం (65శాతం) వంటి జిల్లాల్లో గ్రామీణ యంత్రాంగం నిబద్ధతతో పనిచేసి సత్ఫలితాలు సాధించింది. గ్రామీణ ప్రాంతాల్లో సాధ్యమైనప్పుడు.. అన్ని వసతులు ఉన్న హైదరాబాద్, నల్లగొండ (12 శాతం), నాగర్‌కర్నూల్ (15 శాతం), వికారాబాద్ (18 శాతం) జిల్లాల్లో వ్యాక్సినేషన్ ప్రొగ్రామ్ ఎందుకు వెనుకబడిందనేది ప్రశ్నార్థకంగా మారింది. లక్షలాది మంది బాలికల ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే దీన్ని కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా, విఫలమైన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తున్నది. ప్రచార ఆర్భాటాలు పక్కన పెట్టి, ఇప్పటికైనా స్కూళ్లు, కాలేజీలు, బస్తీల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించకపోతే క్యాన్సర్ ముప్పును నివారించలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేసే ఉచిత సంజీవని..

మహిళల్లో ప్రాణాంతక గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ఈ హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ఎంతో కీలకం. ఈ వైరస్ శరీరంలోకి ప్రవేశించిన తర్వాత క్యాన్సర్‌గా మారడానికి ఏళ్ల సమయం పడుతుంది. అందుకే 9 నుంచి 14 ఏళ్ల వయసున్న బాలికలకు ఈ టీకా ఇస్తే వారిలో శక్తివంతమైన రోగనిరోధక శక్తి తయారవుతుంది. చిన్న వయసులోనే ఈ టీకా రెండు డోసులు తీసుకోవడం వల్ల భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వచ్చే ప్రమాదం దాదాపు 90 శాతానికి పైగా తగ్గుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) స్పష్టం చేస్తోంది.

ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ టీకా ప్రైవేట్ మార్కెట్‌లో సామాన్యులకు భారంగా మారింది. భారత్‌లోనే తయారైన సెర్వావాక్ ధర ఒక డోసుకు రూ.1,400 నుండి రూ.2000 వరకు ఉండగా.. విదేశీ బ్రాండ్లయిన గార్డసిల్ రకాలను బట్టి రూ.4000 నుంచి ఏకంగా రూ.11 వేల వరకు పలుకుతున్నాయి. ప్రైవేటులో వేల రూపాయలు ఖర్చయ్యే ఈ విలువైన క్యాన్సర్ నివారణ టీకాను ప్రస్తుతం ప్రభుత్వం పూర్తి ఉచితంగా అందిస్తోంది. ఇంతటి సువర్ణావకాశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలో వైద్యారోగ్య శాఖ అధికారులు విఫలమయ్యారనే చర్చ జరుగుతున్నది.

# బంగ్లాదేశీయులకు ఊరట
# రెండేళ్ల తర్వాత భారత్ కీలక నిర్ణయం



**న్యూస్ డెస్క్, 26 జూన్ (ఇది కద నిజం):** రెండు సంవత్సరాల తర్వాత బంగ్లాదేశ్ వాసులకు ఊరట ఇచ్చింది ఇండియా. బంగ్లాదేశీయులు ఇండియాలో పర్యటించేందుకు వీలుగా వీసా జారీ ప్రక్రియను ఈనెల 28వ తేదీ నుంచి పునరుద్ధరించనున్నట్లు కేంద్ర సర్కార్ ప్రకటించింది. 2024 ఆగస్టులో అప్పటి బంగ్లా ప్రధాని హసీనా దేశం విడిచి ఇండియాకు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇరు దేశాల సంబంధాలు దెబ్బతిన్నాయి. అప్పటి నుంచి వీసాలను కూడా నిలిపివేసింది ఇండియన్ సర్కార్. ఏడాది ఫిబ్రవరిలో తారిక్ ప్రధాని అయ్యాక మళ్లీ సంబంధాలు క్రమంగా బలపడుతున్నాయి. 2024 లో దాదాపు 17.5 లక్షల మంది బంగ్లాదేశీయులు ఇండియాలో పర్యటించారు. ఇప్పుడు మళ్లీ వీసా జారీ ప్రక్రియను ప్రారంభించింది ఇండియన్ సర్కారు.

# ప్రైవేట్ స్కూళ్లకు షాక్
## ప్రభుత్వ పాఠశాలల్లో భారీగా విద్యార్థుల చేరిక

**న్యూస్ డెస్క్, 26 జూన్ (ఇది కద నిజం):** ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల హాజరు శాతం, అభ్యసన ఫలితాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. విద్యారంగంలో చేపట్టిన సంస్కరణల ఫలితంగా ఈ ఏడాది ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు 1.06 లక్షల మంది విద్యార్థులు కొత్తగా చేరినట్లు అధికారులు వెల్లడించారు.

రాష్ట్రవ్యాప్తంగా 7,620 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా, వాటిలో 3,515 పాఠశాలలు (46.13 శాతం) గరిష్ట సామర్థ్యానికి చేరుకున్నాయని అధికారులు వివరించారు. విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల విశ్వాసం పెరగడం వల్లే ఈ మార్పు సాధ్యమైందని పేర్కొన్నారు. అలాగే ఈ ఏడాది 159 పాఠశాలలు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా రూపాంతరం చెందాయని తెలిపారు.

సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణ అంశంపైనా చర్చ జరిగింది. ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేసి, రాష్ట్రానికి అనువైన విధానాన్ని రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో విద్యలో సాంకేతికత వినియోగాన్ని విస్తరించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. సెప్టెంబర్ 5 నుంచి తొలి దశలో 175 లీప్ పాఠశాలల్లో 9, 10 తరగతుల విద్యార్థులకు గణితం, సైన్స్ అంశాల్లో ఏఐ ట్యూటర్‌ను ప్రీ-పైలట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో క్లిక్కర్స్ వ్యవస్థతో ఏఐ ట్యూటర్‌ను అనుసంధానించాలని లోకేష్ సూచించారు.

అదేవిధంగా ఐఈఆర్‌పీఎస్ రెగ్యులరైజేషన్, హైస్కూల్ ప్లస్‌లలో గెస్ట్ లెక్చరర్ల నియామకంపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. మరోవైపు అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, విశాఖపట్నంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం, మంగళగిరిలో స్కిల్ ఎక్సలెన్స్ సెంటర్ నిర్మాణ ప్రతిపాదనలను మంత్రి పరిశీలించారు. వచ్చే నెలలో అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# హైదరాబాద్ చెరువులకు హైడ్రా టచ్
# రూ.107 కోట్ల భారీ ప్రాజెక్ట్.!

**న్యూస్ డెస్క్, 26 జూన్ (ఇది కద నిజం):** నగరంలో వరదల కట్టడి, భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చెరువుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రూ. 107 కోట్ల భారీ వ్యయంతో మరో నాలుగు ప్రముఖ చెరువుల అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ అధికారికంగా ప్రారంభించారు. ఇబ్రహీంపట్నంలోని పెద్ద చెరువు, కాముని చెరువుల వద్ద ఆయన స్వయంగా భూమి పూజ చేసి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

నాలుగు చెరువులకు సరికొత్త రూపు.. పర్యాటక కేంద్రాలుగా మార్పు

హైడ్రా చేపట్టిన ఈ పునరుద్ధరణ జాబితాలో ఇబ్రహీం పెద్ద చెరువు, భగీరథమ్మ చెరువు, కాముని చెరువు, కాప్రా చెరువులు ఉన్నాయి. మొత్తం 311 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఉన్న ఈ నాలుగు చెరువులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేలా పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. వీటిని కేవలం జలాశయాలుగానే కాకుండా, స్థానికులకు ఆహ్లాదాన్ని పంచే అద్భుతమైన పర్యాటక కేంద్రాలుగా మార్చనున్నారు. ఇందులో భాగంగా చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు (పాత్‌వేలు), ఓపెన్ జిమ్‌లు, పిల్లల కోసం ప్రత్యేక ప్లే ఏరియాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు పెద్ద చెరువుల్లో పర్యాటక శాఖ సహకారంతో త్వరలోనే బోటింగ్ వ్యవస్థను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

పూడికతీతపై కమిషనర్ కఠిన ఆదేశాలు.. రెండు విడతల్లో పనులు

చెరువుల పునరుద్ధరణలో భాగంగా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు పూడికను పూర్తిగా తొలగించాలని, నీరు వచ్చే ఇన్‌లెట్లు, వెళ్లే ఔట్‌లెట్లను శాస్త్రీయంగా అభివృద్ధి చేయాలని కాంట్రాక్టర్లకు కమిషనర్ రంగనాథ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నగరంలో చెరువుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న హైడ్రా.. ఇప్పటికే మొదటి విడతలో 6 చెరువుల అభివృద్ధిని విజయవంతంగా చేపట్టగా, ఇప్పుడు రెండో విడతలో భాగంగా మొత్తం 14 చెరువులను ఆధునీకరించేందుకు విస్తృతమైన చర్యలు తీసుకుంటోంది.

# ఇస్లాంలోకి మారితే రిజర్వేషన్ రాదు

**న్యూస్ డెస్క్, 26 జూన్ (ఇది కద నిజం):** తమిళనాడు మిళనాడు రాష్ట్రంలో ఇస్లాం మతంలోకి మారినా కూడా బ్యాక్‌వర్డ్ క్లాస్ ముస్లిం (బీసీఎం) కోటా కింద రిజర్వేషన్ పొందేలా రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు రద్దు చేస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. న్యాయమూర్తులు జీఆర్ స్వామినాథన్, పీబీ బాలాజీతో కూడిన ధర్మాసనం తమిళనాడు తీసుకొచ్చిన ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమంటూ ఈ తీర్పు వెల్లడించింది.

2024 మార్చి 9న అప్పటి డీఎంకే ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వుల ప్రకారం బీసీ, ఎంబీసీ, డీఎన్‌సీ, ఎస్సీ వర్గాలకు చెందిన వ్యక్తులు ఇస్లాంలోకి మారితే వారిని బ్యాక్‌వర్డ్ క్లాస్ ముస్లిం (బీసీఎం) కేటగిరిలో పరిగణించి రిజర్వేషన్ అందిస్తామని పేర్కొంది. అదేవిధంగా వారిని తమిళనాడులో గుర్తింపు పొందిన ఏడు బీసీఎం ముస్లిం వర్గాల్లో ఒకటిగా కమ్యూనిటీ సర్టిఫికెట్ జారీ చేయాలని కూడా అధికారులను ఆదేశించింది.

డీఎంకే తీసుకొచ్చిన ఉత్తర్వులు చట్టబద్ధం కాదంటూ హైకోర్టు తన తీర్పులో పేర్కొంది. ఇస్లాంలోకి మారిన వ్యక్తి కేవలం ముస్లిం మాత్రమే. అతను బ్యాక్‌వర్డ్ క్లాస్ ముస్లిం (బీసీఎం) హోదా కోరలేడు అంటూ కోర్టు స్పష్టం చేసింది. "హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారిన వ్యక్తి ముస్లింగా మారతాడు. కానీ అతను లబ్బాయి, రావుతర్, మరక్కయార్ లేదా ఇతర ప్రత్యేక ముస్లిం వర్గాలకు చెందినవాడిగా మారడు. ఆ వర్గాలు పుట్టక ఆధారంగా నిర్ణయించినవి. మత మార్పిడితో వాటిలో సభ్యత్వం పొందలేడు" అని ధర్మాసనం స్పష్టం చేసింది.

తమిళనాడులో ప్రస్తుతం బీసీఎం కేటగిరిలో గుర్తింపు పొందిన ఏడు ముస్లిం వర్గాలు వివరాలు ఇవే.. అన్సార్, డెక్కాని ముస్లింలు, దూదేకుల, లబ్బాయి, మాపిళ్ల, షేక్, సయ్యద్ ఈ వర్గాలు బీసీఎం కేటగిరిలో ఉన్నాయి.

2015లో హిందూ కుటుంబంలో జన్మించిన ఓ వ్యక్తి సమీర్ అహ్మద్‌గా పేరు మార్చుకుని ఇస్లాంలోకి చేరాడు. ఆ తర్వాత తనకు ముస్లిం లబ్బాయి కమ్యూనిటీ సర్టిఫికెట్ ఇవ్వాలని దరఖాస్తు చేసుకోగా.. 2022లో తహసీల్దార్ ఆ దరఖాస్తును తిరస్కరించారు. ఆ తర్వాత హైకోర్టును ఆశ్రయించగా.. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటిస్తూ.. సమీర్ అహ్మద్ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా కోర్టు కొట్టివేసింది.

# రాష్ట్రంలో ఐఏఎస్‌ల బదిలీ

**న్యూస్ డెస్క్, 26 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎంఓ నుంచి అజిత్ రెడ్డికి ఉద్వాసన పలికి ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. సీఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్. శ్రీధర్ నియమితులయ్యారు. సబ్యసాచి ఘోష్ కు అదనంగా టెక్స్ టైల్స్ శాఖ బాధ్యతలు అప్పగించింది. అటవీశాఖ ప్రధాన కార్యదర్శిగా శైలజా రామయ్యర్, జీఏడీ ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్, విపత్తు నిర్వహణశాఖ ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జాను నియమించింది.

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ గా టి. వెంకన్న, ఆర్అండ్ బీ ప్రత్యేక కార్యదర్శిగా కె. గంగాధర్, పర్యాటకశాఖ డైరెక్టర్ గా విద్యాసాగర్, రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీగా పి. కాత్యాయనీ దేవి, జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ గా కె. చంద్రకళ, ౧+=జుణజూ వైస్ చైర్మన్ అండ్ ఎండీగా ఎం.డి.ముష్రఫ్ అలీ ఫరూక్, ప్రభుత్వ మైన్స్ అండ్ జియాలజీశాఖ కార్యదర్శిగా ఎం.రఘునందన్ రావులను నియమిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణ రావు ఉత్తర్వులు జారీ చేశారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 27-06-2026

## లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ చేసిన పద్మారావు గౌడ్ సూచన




ఇది కద నిజం, సికింద్రాబాద్ : గత ప్రభుత్వం పేద ప్రజల అవసరాలను గుర్తించి వివిధ పథకాలను ప్రవేశ పెట్టిందని, పేదలకు ఉపకరించే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేసే మొత్తాన్ని పెంచి వారిని ఆదుకోవాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి సంబంధించి 49 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య సేవలకు మంజురైన చెక్కులను సీతాఫలమండీ క్యాంపు కార్యాలయంలో పద్మారావు గౌడ్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో నిరంతరం తాము ప్రజలకు అండగా నిలుస్తున్నామని, సీతాఫలమండీ లో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని ప్రజల సమస్యలను పరిష్కరించే పద్దతిని పాటిస్తున్నామని తెలిపారు. కార్యకర్తలకు, ప్రజలకు తాము అండగా నిలుస్తామని, ఏ అవసరానికైనా ప్రజలు తమ కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా సూచించారు. సికింద్రాబాద్ నియోజకవర్గ బీ.ఆర్.ఎస్. యువ నేత రామేశ్వర గౌడ్, తాజా మాజీ కార్పొరేటర్లు సామాల హేమ, కంది శైలజ, లింగాని ప్రసన్న లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు. 49 మందికి రూ.22 లక్షల విలువచేసే చెక్కులను , ఇద్దరు రోగులకు రూ.5 లక్షల విలువజేసే ఎల్.ఓ.సీ. పత్రాలను పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా పంపిణీ చేశారు.

## బుడగజంగం కాలనీలో డ్రైనేజ్ పనులకు శ్రీకారం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, పిట్లం, జూన్ 26: పిట్లం గ్రామంలోని బుడగజంగం కాలనీలో డ్రైనేజ్ నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ కుమ్మరి శేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. కాలనీలో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల మెరుగుదల లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అవేజ్ బేగ్, మండల సీనియర్ నాయకులు రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శపథం రెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని సర్పంచ్ కుమ్మరి శేఖర్ తెలిపారు.

## ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి:సుల్గే వెంకటేష్

### పాండురంగ నగర్‌లో ముమ్మరంగా ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం

### ఇంటింటికీ తిరిగి ఓటర్ పత్రాల పంపిణీ



ఇది కద నిజం,అత్తాపూర్, జూన్ 26: రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్ డివిజన్ పరిధిలోని పాండురంగ నగర్‌లో శుక్రవారం ఎస్.ఐ.ఆర్ ఓటర్ల సర్వే కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అత్తాపూర్ బీజేపీ అధ్యక్షులు సుల్గే వెంకటేష్, బూత్ స్థాయి అధికారులు (VLOలు) కలిసి కాలనీలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ పత్రాలను స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమైందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. డివిజన్‌లోని ఓటర్లు తమకు అందిన ఓటర్ ఫారమ్‌లలోని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని పూర్తి చేయాలని కోరారు. ఆ ఫారమ్‌కు తప్పనిసరిగా ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను జత చేసి సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో వి.ఎల్.ఓలు మళ్లీ ప్రతి ఇంటికీ సర్వే కోసం వస్తారని, ఆ సమయంలో పూర్తి చేసిన ఈ ఫారమ్‌లను వారికి బాధ్యతగా అందజేయాలని ఆయన ప్రజలను కోరారు. ఓటర్ల జాబితాలో తప్పుల సవరణకు, కొత్త ఓటర్ల నమోదుకు ఈ ప్రక్రియ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి, కార్యదర్శి విజయ్ స్వామి, వైస్ ప్రెసిడెంట్ ఉమ, కాంచన జోషితో పాటు పలువురు వి.ఎల్.ఓలు, స్థానిక కాలనీ కమిటీ సభ్యులు, డివిజన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజం కోసం '2కే రన్' పిట్లం








ఇది కద నిజం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద 'డ్రగ్స్‌కు నో' అనే నినాదంతో శనివారం ఉదయం 2కే రన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ రన్‌లో స్థానిక యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బాన్సువాడ రూరల్ సిఐ తిరుపయ్య మరియు పిట్లం ఎస్సై బి. ఆంజనేయులు మాట్లాడుతూ మాదకద్రవ్యాల మహమ్మారి యువత భవిష్యత్తును పూర్తిగా నాశనం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్ లాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఆయన సూచించారు. యువత దేశ భవిష్యత్తు అని, మత్తు పదార్థాల బారిన పడి జీవితాలను పాడుచేసుకోవద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిట్లం సర్పంచ్ చంద్రశేఖర్, తిమ్మానగర్ సర్పంచ్ ప్రవీణ్, పోతి రెడ్డి పల్లి సర్పంచ్ హేంసింగ్, సీనియర్ నాయకులు, గ్రామ పలువురు ప్రముఖులు, గ్రామస్థులు, యువత, వ్యాపారస్తులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## సిద్దాపూర్ ఫారెస్ట్ శివారులో అధ్వానంగా రహదారి

### గుంతలమయంగా మారడంతో వాహనదారుల ఇబ్బందులు



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: పిట్లం మండలంలోని సిద్దాపూర్ ఫారెస్ట్ శివారు ప్రాంతంలోని ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాల కారణంగా రహదారి మరింత దెబ్బతినడంతో ద్విచక్ర వాహనదారులు, ఇతర ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. అత్యవసర సేవల వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని వాహన దారులు ప్రజలు కోరుతున్నారు.

# క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని ఉద్యమాలు చేపట్టాలి

### -కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండ గట్టాలి

### -శిక్షణ తరగతులలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య

ఇది కద నిజం న్యూస్, గార్ల / జూన్ 27, మహబూబాబాద్ జిల్లా : క్షేత్ర స్థాయి లో ప్రజల్లోకి వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యాయనం చేసి నిరంతరం ఉద్యమాలు చేపట్టాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు సుంకరి వీరయ్య అన్నారు. స్థానిక వర్ధక సంఘం భవనంలో సిపిఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులలో భాగంగా రెండవ రోజు శుక్రవారం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ లు ఎన్నికలకు ముందు అచరణ సాధ్యం కానీ అనేక వాగ్దానాలు ఇచ్చి రెండున్నర సంవత్సరాల గడిచినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. దేశంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, మరోపక్క నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు దిక్కుతోచని స్థితి లో అల్లాడుతున్న పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పాలన లో విసిగిన ప్రజలు కాంగ్రెస్ పార్టీ ని గెలిపిస్తే ఇంత వరకు నూతన పెన్షన్ లు ఇవ్వడం, ఆసరా పెన్షన్ లు పెంచడం, మహిళల కు 2500 రూపాయలు ఇస్తామని, వ్య,కా,స కూలీ లకు 12 వేల రూపాయలు ఇస్తామని, దళిత బంధు స్థానం లో అంబేద్కర్ స్వయం ఉపాధి క్రింద 12 లక్షల రూపాయలు, నిరుద్యోగులకు ఏటా ప్రభుత్వ ఉద్యోగాలు ఇంత వరకు అమలు కాలేదని విమర్శించారు.ఇండ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు, ఇండ్లు, తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, పెన్షన్ లు ఇస్తామన్న హామీలు అటకెక్కాయని విమర్శించారు. శాఖ ల స్థాయి లో స్థానిక సమస్య లను గుర్తించి ప్రజలను చైతన్యవంతశీ చేసి దశల వారీగా ఉద్యమాలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రెండవ రోజు శిక్షణ తరగతులో భాగంగా ఎస్. వీరయ్య పార్టీ చరిత్ర, మార్క్సిస్టు సిద్ధాంతం, సమకాలీన రాజకీయ పరిస్థితులు, ప్రజా ఉద్యమాల నిర్మాణం, కార్యకర్తల బాధ్యతలపై విశ్లేషణాత్మక అవగాహన కల్పించారు. ఈ శిక్షణ తరగతులకు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్ ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు. ఈ శిక్షణ తరగతులలో సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా, మండల నాయకులు శెట్టి వెంకన్న,అలవాల వీరయ్య, గునిగంటి రాజన్న, ఆకుల రాజు, కందునూరి కవిత, ఉప్పన పెల్లి శ్రీనివాస్, సమ్మెట రాజమౌళి, నక్క సైదులు, బొల్లం అశోక్, దూడ్డేల రామూర్తి, బానోత్ సీతారాం, మండల కార్యదర్శి అలవాల సత్యవతి, జిల్లాలోని ఆయా మండలాల కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.




## దాల్మియా యాజమాన్యం తొలిదశ నిర్మాణంలో ఇచ్చిన హామీలను అమలు చేయండి

### సిపిఎం నాయకులు వీరణాల శివ నారాయణ డిమాండ్.




ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా జూన్ 26: దాల్మియా పరిశ్రమ యాజమాన్యం చుట్టు పక్కల గ్రామ ప్రజలకు తొలి దశ నిర్మాణంలో ఇచ్చిన హామీని ఇంత వరకు అమలు పాటించలేదని, మళ్ళీ దాల్మియా యాజమాన్యం ప్లాంట్ రెండో దశ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారని, ఇచ్చిన హామీలు యాజమాన్యం ముందు పరిష్కరించాలని, సిపిఎం పార్టీ గా డిమాండ్ చేస్తున్నారని సిపిఎం నాయకులు వీరణాల శివ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం మైలవరం నందు విలేఖరుల సమావేశ నిర్వాహణలో మాట్లాడుతూ.. దాల్మియా పరిశ్రమ యాజమాన్యం చుట్టు పక్కల గ్రామాల ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నదని అన్నారు.

ముఖ్యంగా దాల్మియా పరిశ్రమ పక్కనే ఉన్న దుగ్గనపల్లె,నవాబుపేట,చిన్నకోమెర్ల,పెద్ద కొమెర్ల లో పరిశ్రమ బ్లాస్టింగ్ సమయంలో ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని అలాగే దాల్మియా పరిశ్రమ వల్ల వచ్చే దుమ్ము,పొగ కాలుష్యం కారణంగా పంట పొలాలు దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారన్నారు. దాల్మియా యాజమాన్యం భూముల కొనుగోలు సమయంలో ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తామని చెప్పారు. అది ఇవ్వలేదన్నారు.మొదటి విడత లో ఇచ్చిన హామీని ఇప్పటి వరకు అమలు చేయలేదని మళ్ళీ ప్లాంట్ రెండో దశ నిర్మాణం కోసం రైతుల భూముల సేకరణ చేస్తున్నారని అక్కడి రైతులు, ప్రజలు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ప్లాంట్ విస్తీర్ణం కోసం కలెక్టర్ నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తారని కాలం గడుస్తున్నదని హామీ నెరవేరడం లేదన్నారు.రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని వారి పోరాటానికి సిపిఎం మద్దతుగా ఉంటుందని, అండగా పోరాడుతుందని, తెలిపారు. సమావేశంలో మైలవరం మండల కార్యదర్శి కొండయ్య, నాయకులు సంజీవ రాయుడు పాల్గొన్నారు.

# ఆగస్టు 15 న కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభం"

### పనులు వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం"

సత్తుపల్లి,జూన్26(ఇది కద నిజం) న్యూస్: సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలంలో గల కల్లూరుగూడెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీ పనులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు.సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి,దయానంద్ ఉన్నతాధికారులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించిన మంత్రి, ఆగస్టు 15 నాటికి ఫ్యాక్టరీని ప్రారంభించేలా నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ దేశంలోనే పామాయిల్ సాగులో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని తెలిపారు. రాబోయే రెండు నుంచి మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో పామాయిల్ సాగును 10 లక్షల ఎకరాలకు విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ప్రతి జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

పామాయిల్ రైతులకు కనీస గ్యారంటీ ధర లభించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రులతో కలిసి త్వరలో ప్రధానమంత్రిని కలిసి విజ్ఞప్తి చేయనున్నట్లు వెల్లడించారు.సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన అవకాశంతో ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించామని, ఇంకా మిగిలిన అభివృద్ధి పనులను కూడా పూర్తిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. బుగ్గపాడులో ఏర్పడుతున్న పరిశ్రమతో పాటు మరో రెండు మూడు నెలల్లో మరో రెండు మూడు పరిశ్రమలు తీసుకొచ్చేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఖమ్మం జిల్లాను అభివృద్ధిలో తెలంగాణలోనే నంబర్--1 జిల్లాగా నిలపడం తన లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో: కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాసర చంద్రశేఖర్ రెడ్డి,జిల్లా కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి,కూరపాటి శ్రీనివాసరావు (నాని), దోమ ఆనంద్,మామిళ్లపల్లి వెంకటేశ్వరరావు,మాజీ జెడ్పీటీసీ బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు,కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏ సిపి వసుంధర,తహశీల్దార్ జె.మాణిక్ రావు,వ్యవసాయాశాఖాధికారి పచ్చల రామ్మోహన్,ఎంపీఓ భూక్యా రంజిత్ కుమార్,రైతులు కుక్కపల్లి శ్రీను,నీలపాల నాగరాజు,కిన్నెర ప్రసాద్,చల్లగుల్ల నరసింహారావు,నున్నా రంగారావు,పొట్లపూల వెంకటరావు,వెల్ది జగన్మోహన్ రావు, కోట సత్యనారాయణ,తుంబురు రామిరెడ్డి,వంట్లా పెద్దబాబు తదితరులు పాల్గొన్నారు.





## కుల మతాలకు అతీతంగా మొహరం పండుగ..

### టిడిపి జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా జూన్ 26:

జమ్మలమడుగు పట్టణంలోని గుడు మస్తాన్ దర్గా వద్ద పీర్ల చావిడిలో మొహరం పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన పీర్ల స్వాములకు టిడిపి జిల్లా అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి పూల చాదర్లు సమర్పించి ప్రత్యేక ప్రార్ధన నిర్వహించారు. అనంతరం అక్కడే ఉన్న హజరత్ సయ్యద్ షా గూడుమస్తాన్ వలి స్వామి దర్గా యందు స్వామివారికి ప్రత్యేక గిలాఫులు, పూల చాదర్లు సమర్పించి ప్రత్యేక ప్రార్ధన నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి మాట్లాడుతూ.. జమ్మలమడుగు పట్టణంలో కుల, మతాలకతీతంగా హిందువులు, ముస్లింలు అన్న తేడా లేకుండా పీర్ల స్వాములకు ప్రత్యేక ప్రార్ధనలు చేస్తున్నారని ప్రజలందరూ కలిసి సంతోషంగా మొహరం పండుగ నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. కడప జిల్లాలో అన్ని రకాల సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలని, జిల్లాలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, కడప జిల్లా అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలని ప్రత్యేక ప్రార్ధనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ముస్లిం సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

# సినిమా న్యూస్



## ప్రభాస్ బిగ్ బ్లాస్ట

దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన 'బాహుబలి' రెండు భాగాలుగా వచ్చి బాక్సాఫీసును షేక్ చేసిన విషయం తెలిసిందే. ప్రభాస్, రానా, అనుష్క, తమన్నా, సత్యరాజ్, రమ్యకృష్ణ వంటి స్టార్స్ నటించిన ఈ చిత్రం వరల్డ్ వైడ్‌గా కలెక్షన్ల వర్షం కురిపించడమే కాకుండా.. ప్రపంచవ్యాప్తంగా టాలీవుడ్ సత్తాను తెలిసేలా చేశాయి. ఇదిలా ఉంటే, తాజాగా ఎవరూ ఊహించని ఒక మైండ్ బ్లోయింగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా 'బాహుబలి: ది టార్చ్ బేరర్' స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన ఒక ప్రమోషనల్ వీడియోలో రెబల్ స్టార్ ప్రభాస్ స్వయంగా ఒక క్రేజీ గుడ్ న్యూస్ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినిమా లవర్స్ ఎవరూ అస్సలు ఊహించని విధంగా 'బాహుబలి-3' రాబోతోందని ప్రభాస్ అధికారికంగా ప్రకటించారు.

మీ అందరి కోసం బాహుబలి 3 వస్తోంది అంటూ ప్రభాస్ చెప్పిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న ప్రభాస్ ఫ్యాన్స్, నెటిజన్లు ఫుల్ ఖుషీ అవుతున్నారు. కాగా.. ప్రభాస్ సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం ఆయన స్పిరిట్, సలార్-2, కల్కి-2, ఫౌజీ వంటి సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. అయినప్పటికీ టాలీవుడ్ యంగ్ హీరోల చిత్రాలకు సపోర్ట్‌గా నిలుస్తూ.. ప్రమోషన్స్‌లో ఫుల్ యాక్టివ్‌గా పాల్గొంటున్నారు. దీంతో ప్రభాస్ అభిమానులు కాస్త నిరాశ వ్యక్తం చేస్తున్నారు. తన సినిమాల కంటే.. ఇతర ప్రాజెక్ట్స్ విషయంలోనే ఆయన ఆసక్తి చూపిస్తున్నారని అంటున్నారు. అంతేకాకుండా తన చిత్రాలకు సంబంధించిన అప్డ?ట్స్‌ను కూడా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఏదో ఒక అప్డేట్ ఎప్పుడెప్పుడు వస్తుందా అని అభిమానులు వేయి కళ్లతో ఎదురుచూస్తుండగా.. ప్రభాస్ 'బాహుబలి-3' ప్రకటించడంతో అందరి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ప్రకటన సోషల్ మీడియాను షేక్ చేస్తుంది.

## నాగ్ అశ్విన్ మాస్టర్ ప్లాన్


పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, దర్శకుడు నాగ్ అశ్విన్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'కల్కి 2898 ఏడి' భారతీయ సినీ చరిత్రలోనే అతిపెద్ద విజువల్ వండర్స్‌లో ఒకటిగా నిలిచింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రస్తుతం అభిమానులందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'కల్కి 2' కోసం చిత్రబృందం సన్నాహాలు చేస్తుండగా.. దర్శకుడు నాగ్ అశ్విన్ మరో ఆసక్తికరమైన ప్లాన్‌తో సిద్ధమవుతున్నట్లు సమాచారం.

'కల్కి 2898 ఏడి' విడుదల సమయంలో అమెజాన్ ప్రైమ్ వీడియో కోసం ప్రత్యేక యానిమేషన్ సిరీస్‌ను తీసుకొచ్చిన నాగ్ అశ్విన్.. ఇప్పుడు 'కల్కి 2' విడుదలకు ముందే మరోసారి డిజిటల్ కంటెంట్‌తో ప్రేక్షకులను అలరించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈసారి సినిమాలోని కీలక పాత్రల నేపథ్యాన్ని వివరించే రెండు ప్రత్యేక వెబ్ సిరీస్‌లను రూపొందించే ఆలోచనలో ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ రెండు వెబ్ సిరీస్‌లలో ఒకటి దుల్కర్ సల్మాన్ పోషించిన పాత్రకు సంబంధించిన బ్యాక్‌స్టోరీపై ఉండనుండగా.. మరో సిరీస్ సుమతి పాత్ర చుట్టూ తిరగనుందని తెలుస్తోంది.



'కల్కి పార్ట్ 1'లో సుమతి పాత్రను దీపికా పదుకొణె పోషించగా.. రెండో భాగంలో ఈ పాత్రలో సాయి పల్లవి కనిపించే అవకాశముందని ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సుమతి పాత్ర గతం, ఆమెకు కల్కి ప్రపంచంతో ఉన్న అనుబంధాన్ని మరింత లోతుగా చూపించేలా ఈ వెబ్ సిరీస్‌ను రూపొందించనున్నట్లు తెలుస్తోంది. ఈ వెబ్ సిరీస్‌ల కథలు 'కల్కి పార్ట్ 1' క్లైమాక్స్‌తో అనుసంధానమై ఉండనున్నాయని సమాచారం. ప్రతి సిరీస్‌ను దాదాపు గంట నిడివితో రూపొందించేలా ప్లాన్ చేస్తున్నారట. ఈ కథల ద్వారా ప్రేక్షకులకు సినిమాలోని పాత్రల భావోద్వేగాలు, వారి గతం, భవిష్యత్తు కథనాలపై మరింత స్పష్టత వచ్చేలా నాగ్ అశ్విన్ ప్లాన్ చేస్తున్నట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.

అలాగే ఈ ప్రత్యేక వెబ్ సిరీస్‌లను 'కల్కి పార్ట్ 2' థియేటర్లలోకి రాకముందే ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ SonyLIVలో స్ట్రీమింగ్ చేయాలనే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఒకవేళ ఈ వార్తలు నిజమైతే.. 'కల్కి' విశ్వాన్ని మరింత విస్తరించే ప్రయత్నంగా ఈ వెబ్ సిరీస్‌లు నిలవనున్నాయి. దీంతో 'కల్కి పార్ట్ 2'పై ఇప్పటికే ఉన్న అంచనాలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. అభిమానులు ఇప్పుడు ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## నాకు సాటి ఎవరూ లేరు!

టాలీవుడ్ యంగ్ బ్యూటీ శ్రీలీల తన నటన, డ్యాన్సింగ్ స్టెప్స్‌తో ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే ఊహించని క్రేజ్ రాబట్టుకున్నారు. స్టార్ హీరోలతో కలిసి నటిస్తూ టాలీవుడ్‌లో మోస్ట్ బిజీ హీరోయిన్‌గా మారారు. ప్రస్తుతం వరుస సినిమాల్లో నటిస్తున్నప్పటికీ అమ్మడుకి సరైన హిట్ పడకపోవడంతో సతమతమవుతున్నారు. ఇటీవల 'పరాశక్తి' చిత్రంతో ప్రేక్షకులను అలరించినప్పటికీ హిట్ అందుకోలేకపోయారు. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ సరసన 'డి-55' మూవీలో నటిస్తున్నారు. అదృష్టం కలిసిరానప్పటికీ శ్రీలీలకు అవకాశాల కొరత మాత్రం లేదు. స్టార్స్ సరసన చాన్స్‌లు దక్కించుకుంటూ బిజీగా గడుపుతున్నారు. ఇదిలా ఉంటే, తాజాగా శ్రీలీల గురించి సోషల్ మీడియాలో ఒక వార్త విపరీతంగా వైరల్ అవుతూ.. పెద్ద వివాదంగా మారింది. ఇండస్ట్రీలో తనతో సమానంగా డ్యాన్స్ చేయగల వాళ్లే లేరని శ్రీలీల అన్నట్లు వార్తలు వచ్చాయి. ఈ కామెంట్స్ వైరల్ కావడంతో నెటిజన్లు కొందరు శ్రీలీలకు పొగరు, అహంకారం పెరిగిపోయాయంటూ ఆమెను విమర్శించడం మొదలుపెట్టారు.

ఈ పుకార్లు కాస్తా తన దాకా రావడంతో శ్రీలీల వెంటనే స్పందించి, వీటికి పూర్తిగా చెక్ పెడుతూ అందరికీ అర్థమయ్యేలా క్లారిటీ ఇచ్చారు. తనపై వస్తున్న తప్పుడు వార్తలను శ్రీలీల తీవ్రంగా ఖండించారు. తనతో సమానంగా ఎవరూ డ్యాన్స్ చేయలేరని తాను అన్నట్లు వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఆమె స్పష్టం చేశారు. తాను ఎప్పుడూ అలాంటి మాటలు మాట్లాడలేదని, కొందరు తన మాటలను తప్పుగా అర్థం చేసుకుని, తనకు గర్వం ఉందంటూ విమర్శలు చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఎప్పుడూ అహంకారం లేదని, తన తల్లిదండ్రులు తనను అలా పెంచలేదని శ్రీలీల చెప్పారు. తోటి నటీనటులను, వారి టాలెంట్‌ను గౌరవించడం తన అలవాటని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి అబద్ధపు పుకార్లు పుట్టించేవారు ఇకనైనా తమ పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. తన గురించి బాగా తెలిసిన వాళ్లకు తన నిజ స్వభావం ఏంటో కచ్చితంగా అర్థమవుతుందని శ్రీలీల అన్నారు.

## 'శ్రీనివాస మంగాపురం'కు రీషూట్ ప్లాన్ చేస్తున్న టీమ్?




టాలీవుడ్ సీనియర్ స్టార్ నటుడు సూపర్ స్టార్ కృష్ణ మనవడు, ఘట్టమనేని రమేష్ బాబు కుమారుడు ఘట్టమనేని జయకృష్ణ హీరోగా నటిస్తున్న తొలి చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ సినిమాతో ఆయన వెండితెరకు హీరోగా పరిచయం కానున్నారు. అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రవీనా టాండన్ కుమార్తె రషా థడాని హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాను జూలై 9వ తేదీన విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. తాజాగా ఈ చిత్ర బృందం సినిమా ఫస్ట్ కాపీని వీక్షించినట్లు సమాచారం. సినిమా మొత్తం అద్భుతంగా వచ్చినప్పటికీ, క్లైమాక్స్‌లో హీరోకు సంబంధించిన మరో ఒకటి లేదా రెండు కీలక సన్నివేశాలు జోడిస్తే సినిమా మరింత ప్రభావవంతంగా ఉంటుందని యూనిట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఒక రోజు రీషూట్ నిర్వహించే అవకాశముందని ఓ వార్త ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఇప్పటికే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. మరి ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి. మోహన్ బాబు, నరేష్ విజయకృష్ణ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించగా, పి. ఉదయ్ కిరణ్, జెమిని కిరణ్, పి. కిరణ్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.